

వాహన చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం అర్బన్: వాహనాలు నడిపే వారు తప్పక హెల్మెట్ ధరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు స్పష్టం చేశారు. అతి వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దన్నారు. నగరంలోని ఎంపిఆర్ న్యాయ కళాశాలలో వాహనదారుల అవగాహనా సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు, లైసెన్స్ లేని వారు వాహనాలు నడపరాదన్నారు. మోటార్ వాహనాల చట్టం, హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. సదస్సులో ఎంపిఆర్ లా కాలేజ్ ప్రిన్సిపాల్ కె.మోషి, న్యాయవాది ఐ.పాపయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

'సహారా' డిపాజిట్లు చెల్లించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మనాయుడు
- కలెక్టరేట్ వద్ద ఖాతాదారులు, ఏజెంట్ల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సహారా ఖాతాదారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సహారా ఇండియా ఖాతాదారులకు వెంటనే డిపాజిట్ సొమ్ము చెల్లించాలని, లేకుంటే దశలవారీ పోరాటాలు చేపడుతామని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఉపాధ్యక్షులు కె.సూరయ్య, సహారా ఇండియా ఖాతాదారుల పోరాట కమిటీ జిల్లా అధ్యక్షులు బోయిన సత్యనారాయణ హెచ్చరించారు. సహారా ఖాతాదారులు, ఏజెంట్లకు పూర్తిగా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ బంగ్లా రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహారా సంస్థను నమ్మిన ఖాతాదారులు, ఏజెంట్లను మోసం చేసిందన్నారు. తమ సంస్థలో డబ్బులు పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి ఏజెంట్లు, ఖాతాదారుల నుంచి రూ.వేల కోట్లు వసూలు చేసిందని తెలిపారు. ఖాతాదారులకు ఇచ్చిన బాండ్ల సమయం ముగిసినా డబ్బులు ఇవ్వకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. ఖాతాదారులకు 15 శాతం వడ్డీతో డిపాజిట్ సొమ్మును చెల్లించాలని 2012లో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేశారు. సహారా సంస్థ డబ్బులు చెల్లించకపోయినా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి పెద్దల అండదండలు సహారా సంస్థకు ఉన్నాయని తెలిపారు. ఖాతాదారుల డిపాజిట్ సొమ్ము కంటే మూడు రెట ఆస్తులు ఉన్నాయని ఆ సంస్థ ప్రకటించిందని, చాలా ఆస్తులను కేంద్ర సంస్థలు సీజ్ చేసినా ఖాతాదారులకు సొమ్ము చెల్లించడానికి కేంద్ర ప్రభుత్వానికి పదేళ్ల సమయం సరిపోదా అని ప్రశ్నించారు. జిల్లాలో లక్ష మంది వరకు బాధితులకు రూ.500 కోట్లు చెల్లించాల్సి ఉందని చెప్పారు. 2018లో బాండ్ల డబ్బులు ఇస్తామని చెప్పి మళ్లీ వాటిని సహారా క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ అని, స్టార్స్ మల్టీపర్పస్ కో-ఆపరేటివ్ సొసైటీలకు మళ్లించిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి సహారా సంస్థపై చర్యలు తీసుకుని, ఖాతాదారులందరికీ మొత్తం డబ్బులను వారి ఖాతాలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జిల్లా పరిషత్‌లో 'మీకోసం'లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, సహారా ఏజెంట్లు బి.సత్తిరాజు, పి.బాబూరావు, సిహెచ్.మాధవరావు, ఖాతాదారులు పాల్గొన్నారు.

పోలీసులపై ప్రజల నమ్మకాన్ని పెంచుతా...

- గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- శాంతిభద్రతల పరిరక్షణకు కృషి
- ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పోలీసుశాఖలో ప్రజలకు నమ్మకం పెరిగేలా పనిచేస్తానని ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయానికి సోమవారం చేరుకున్న ఆయనకు ఆర్మ్‌డ్ పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అదనపు ఎస్‌పిలు జి.ప్రేమ్ కాజల్, వి.ఉమామహేశ్వరరావు, ఎస్ఐబి అదనపు ఎస్‌పి డి.గంగాధర్ స్వాగతం పలికారు. అనంతరం ఆయన తన ఛాంబరులో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. మహిళలు, చిన్నారుల రక్షణకు తొలి ప్రాధాన్యత ఇస్తూ మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. పోలీస్ శాఖపై జిల్లా ప్రజలకు నమ్మకం కలిగేలా సేవలందిస్తామని చెప్పారు. సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. జిల్లాపై అవగాహన పెంచుకుని నేర నియంత్రణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించి, నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం అదనపు ఎస్‌పి, డిఎస్‌పిలతో కొద్దిసేపు మాట్లాడి జిల్లా పరిస్థితులను తెలుసుకున్నారు.

బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయనకు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, పోలీసు అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛాలను అందించి అభినందనలు తెలిపారు. తొలుత ఆయన అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం జిల్లా కోర్టులో జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానాను మర్యాదపూర్వకంగా కలిశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

కార్మిక సంక్షేమ చట్టం అమలు చేయాలి



కలెక్టర్‌కు వివరిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు

- బిఆర్ఎయులో అక్రమాలపై ఫిర్యాదు
- 'మీకోసం'కు 196 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వం నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని రద్దు చేయడంతో యజమానుల నుంచి సేకరించిన సెస్‌ను దారి మళ్లించారని, దీనివల్ల జిల్లాలో సుమారు లక్ష మందికి పైగా ఉన్న భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ నిధి నుంచి అందాల్సిన క్లయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి ఎం.హరనాథ్, అధ్యక్షులు టి.హరినారాయణ, ఉపాధ్యక్షులు ఎ.కామేశ్వరరావులు కోరారు. జెడ్‌పిలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఎం.నవీన్‌లు మీకోసం కార్యక్రమంలో సోమవారం వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు కలెక్టరేట్‌లో మాట్లాడుతూ సంక్షేమ చట్టం నిలుపుదలతో జిల్లాలో సుమారు లక్ష నిర్మాణ కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. దీంతో మృతి చెందిన కుటుంబాలకు, అంగవైకల్యం, వివాహం, ప్రసవం వంటి అవసరాలకు చెల్లించాల్సిన వేలాది క్లయిమ్‌లు గత నాలుగేళ్లుగా చెల్లించడం లేదని అన్నారు. చట్టప్రకారం, నిర్మాణ యజమానుల నుంచి నిర్మాణ విలువలో ఒక శాతం సెస్ వసూలు చేసి క్లయిమ్‌లు చెల్లింపునకు వినియోగించాల్సి ఉందన్నారు. ఖజానాపై పైసా కూడా భారం పడకుండా క్లయిమ్‌లు పరిష్కరించేందుకు వీలుందన్నారు. ఇప్పటికీ సెస్ వసూలు కొనసాగుతున్నా క్లయిమ్‌లను మాత్రం పరిష్కరించడం లేదని వివరించారు. వసూలైన సెస్‌ను ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే 'నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం' అమలు చేసి పెండింగ్ క్లయిమ్‌లను కార్మికులకు చెల్లించేందుకు ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. అలాగే అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో నియామకాల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, ఈ నియామకాలపై సమగ్ర విచారణ చేపట్టాలని దళిత జెఎసి నాయకులు కె.రాంగోపాల్ కలెక్టర్‌కు వినతిపత్రం అంజేశారు.

సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నిర్మాణంలో ఉన్న రోడ్డు కోసం ప్రభుత్వం భూములను సేకరించిందని, అందులో టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లో పలు లేఅవుట్ల మధ్య నుంచి రోడ్డు పడిందని బాధితులు కలెక్టర్ వివరించారు. అప్రూవుడ్ లేఅవుట్ కావడంతో ఇళ్ల స్థలాలుగా మారుస్తూ కన్వర్షన్ ఛార్జీలను, వివిధ రూపాల్లో పన్నులు చెల్లించామని అన్నారు. ఇప్పుడు ఆ స్థలాలను రోడ్డు నిర్మాణానికి తీసుకున్నారని అన్నారు. కానీ, వ్యవసాయ భూముల మాదిరిగానే పరిహారం చెల్లిస్తున్నారని వివరించారు. గతంలో అధిక ధర చెల్లించి ఇళ్ల స్థలాలకు కొనుగోలు చేశారని, ఇప్పుడు తక్కువ పరిహారం చెల్లించడం వల్ల రూ.లక్షల్లో నష్టపోతున్నామని అన్నారు. అపీల్ చేసుకునే అవకాశం కల్పించి అదనపు పరిహారం చెల్లించాలని బాధితులు వెంకటరమణ, జయలక్ష్మి తదితరులు విన్నవించుకున్నారు. జిల్లాలో వ్యక్తిగత సమస్యలతో పాటు భూవివాదాల పరిష్కారానికి 196 వినతులు వచ్చారు.

జి.సిగడాం మండలం వెలగాడకు చెందిన పెట్టి ఆదిలక్ష్మి నడవలేని పరిస్థితిని కలెక్టర్ గమనించి ఆయనే ఆమె వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఆమెకు తన భూమిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకున్నారని, భూ సమస్య పరిష్కరించాలని వినతిపత్రం అందజేసింది. తక్షణమే ఈ సమస్య పరిష్కారంతో పాటు జాప్యానికి గల కారణాన్ని తెలపాలని జి.సిగడాం తహశీల్దార్‌ను ఆదేశించారు. కొత్తూరు మండలం ఆకులతంపరలో ప్రజా సౌకర్యార్థం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఏర్పాటు చేసిన తాగునీటి బోరుకు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తాళాలు వేసి ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.గణపతిరావు, జిల్లా పరిషత్ సిఇఒ వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ రామ్మోహనరావు, హౌసింగ్ పీడీ నగేష్, డ్వామా పీడీ చిట్టిరాజు, డిఎంహెచ్ఒ డాక్టర్ మీనాక్షి, డిసిహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణ్‌బాబు, డిఇఒ వెంకటేశ్వరరావు, ఉద్యాన అధికారి వరప్రసాద్ పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: అన్ని ప్రభుత్వ రంగశాఖల సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యమని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో డిఆర్‌డిఎ, విద్యాశాఖ, ఉపాధి హామీ, పంచాతీరాజ్, ఎస్‌సి కార్పొరేషన్ అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారదర్శకంగా పాలన అందించడానికి ప్రభుత్వశాఖలు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరుతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయాలన్నారు. ఉపాధి హామీ ద్వారా ఉద్యాన పంటలకు, పశుపోషణ ప్రోత్సాహానికి నూటికి నూరు శాతం అమలు చేయాలని సూచించారు. ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు, ఎపిడి శైలజ, ఎపిఒలు జి.హరిప్రసాద్, బాగాది ప్రసాదరావు, మార్పు నాగరాజు, ఎంఇఒలు రోణంకి జయప్రకాష్, రామానందం పాల్గొన్నారు.



ఉపకార వేతనాలను అందజేస్తున్న రవికుమార్

ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటుకు కృషి

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆమదాలవలస నియోజకవర్గంలో ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి చెందిన 14 మంది విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో విజయం సాధించి ఉపకార వేతనం పొందడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఆమదాలవలసలో ప్రభుత్వ ఐటిఐని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో 75 జ్యోతిరావు పూలే పాఠశాలలు ప్రారంభిస్తే ,తర్వాత ఏర్పడిన వైసిపి ప్రభుత్వం కనీస వసతి సౌకర్యాలను కల్పించలేకపోయిందని విమర్శించారు. అవే పాఠశాలల ద్వారా కెజి నుంచి పిజి వరకు విద్యావకాశాలు కల్పించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు రవికుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు జి.రాజేంద్ర ప్రసాద్, టింగరాజు, ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, మాజీ వైస్ చైర్మన్ కూన వెంకట రాజ్యలక్ష్మి, టిడిపి నాయకులు నూకరాజు, తమ్మినేని చంద్రశేఖర్, బొడ్డేపల్లి గౌరీపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నీట్'పై కేంద్రం నిర్లక్ష్యం

ప్రజారోగ్య పరిరక్షణ వేదిక అధ్యక్షులు డాక్టర్ ఆర్.మల్లేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రతిష్టాత్మకమైన 'నీట్' పరీక్ష నిర్వహణలో తీవ్ర తప్పిదాలతో విద్యార్థి లోకం దేశవ్యాప్తంగా ఆందోళనలో ఉన్నా పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనిప్రజారోగ్య పరిరక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు, జెమ్స్ మెడికల్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.మల్లేశ్వరరావు విమర్శించారు. స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ల సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన 'పోటీ పరీక్షల్లో అవకతవకలు- ప్రభుత్వ విధానాలు-యువత కర్తవ్యం' అనే అంశంపై సోమవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. ప్రైవేటీకరణ విధానాల వల్ల వైద్యరంగం ఇప్పటికే అస్తవ్యస్తంగా ఉందన్నారు. నీట్ అనుభవాలు భవిష్యత్ వైద్య వృత్తిపై నీలినీడలు కమ్ముకునేలా ఉన్నాయని తెలిపారు. దీనిపై యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ నిష్కలంక దేశభక్తుడు కవి, గాయకుడు గరిమెళ్ల జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో గరిమెళ్ల నిర్వహించిన పాత్ర తెలుగు జాతిపై చెరగని ముద్ర వేసిందని కొనియాడారు. సభాధ్యక్షులు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి గరిమెళ్ల జీవిత విశేషాలను వివరించారు. సామ్రాజ్యవాద వ్యతిరేకత, ఆర్థిక స్వావలంబన, అభిప్రాయ స్వేచ్ఛ, నీతి నిజాయతీ, త్యాగనిరతి వంటి గరిమెళ్ల వ్యక్తిత్వ లక్షణాలను నేటి యువత ఆలంబనగా స్వీకరించి అన్వయించుకోవాలని ఆకాంక్షించారు. 'నిరుద్యోగ భారతం- సమస్యకు కారణాలు పరిష్కారాలు' అంశంపై వ్యాసరచన, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా-ఆవశ్యకత అంశంపై వక్తృత్వ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. నీట్ పరీక్ష సమస్యపై మహిళా డిగ్రీ కళాశాల పూర్వ అధ్యాపకులు, రచయిత్రి పత్తి సుమతి రాసిన కవితను చదివి వినిపించారు. ముందుగా గరిమెళ్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు ఆహ్వానం పలకగా, పి.సుధాకరరావు వందన సమర్పణ చేశారు.



మాట్లాడుతున్న డాక్టర్ మల్లేశ్వరరావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

రిమాండ్ ఖైదీల ఛార్జిషీట్లు వేగవంతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారి కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఛార్జిషీట్ల దాఖలు వేగవంతం చేయాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా కోర్టులో పోలీసు అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఛార్జిషీట్ల దాఖలులో జాప్యం ఉండకూడదన్నారు. ఛార్జీషీట్‌లు వేసిన వారికి త్వరితగతిన న్యాయం చేకూర్చడంలో పోలీస్ యంత్రాంగం పనిచేయాలని ఆదేశించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు హిట్ అండ్ రన్ కేసులపై వివరించారు. ప్రమాదం చేసి తప్పించుకునే వారిపై సూచనలు ఇచ్చారు. దీనిలో 9 కేసులు గుర్తించామని పేర్కొన్నారు. సమావేశంలో దిశ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శన దొర, జైలు సూపరింటెండెంట్, సబ్ జైలు అధికారి పాల్గొన్నారు.

వీలైనంత త్వరగా కార్పొరేషన్ ఎన్నికలు

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరపాలక సంస్థకు వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నగర కేడర్‌తో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నగరపాలక సంస్థకు ఎన్నికలు జరిగితేనే అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. విలీన పంచాయతీల విషయంలో తలెత్తిన సమస్యలను పరిష్కరిస్తానన్నారు. గత ప్రభుత్వం నగరంలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి కేంద్రీకరించలేదని విమర్శించారు. నగర అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అన్ని డివిజన్ల ఇన్‌ఛార్జీలు, నాయకులు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. కలసికట్టుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అభివృద్ధి విషయంలో నాయకుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటానని తెలిపారు. డివిజన్ ఇన్‌ఛార్జీలు అధికారులపై పెత్తనం చేయొద్దని సూచించారు. ఏదైనా పని ఉంటే అధికారుల వద్దకు వెళ్లి సున్నితంగా మాట్లాడి చేయించుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ వ్యవహరించ వద్దన్నారు. కొందరు నాయకులు సచివాలయాల్లో సమీక్షలు నిర్వహించారని, దీనిపై పత్రికలో వచ్చిన కథనాలను తాను పరిశీలించానన్నారు. అలాంటివి చేయొద్దని స్పష్టం చేశారు. పార్టీకి చెడ్డ పేరు తీసుకురాకుండా పనిచేయాలన్నారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, అంధవరపు సంతోష్, పి.వి రమణ, కలగ జగదీష్, సింతు సుధాకర్, కోరాడ హరగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొండు శంకర్

శాంతియుత జిల్లా శ్రీకాకుళం

- ఎక్కడకు వెళ్లినా ఇక్కడి ప్రజలను మర్చిపోను
- వీడ్కోలు సభలో ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రశాంత వాతావరణం కలిగిన జిల్లా శ్రీకాకుళం అని బదిలీపై వెళ్లిన ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. జిల్లాలో పనిచేసిన సుమారు రెండున్నరేళ్లు తనకు తీపి గురుతులుగా ఉంటాయన్నారు. బదిలీపై వెళ్తున్న ఆమెకు ఎచ్చెర్లలోని ఆర్మ్‌డ్ రిజర్వు మైదానంలో పోలీసు సిబ్బంది సోమవారం గౌరవ వందనం సమర్పించి ఘనంగా వీడ్కోలు పలికారు. శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడకు వెళ్లినా శ్రీకాకుళం జిల్లా ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బందిని మరిచిపోలేనన్నారు. విధి నిర్వహణలో తనకు సహాయ సహకారాలు అందించారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆర్మ్‌డ్ పోలీస్ విభాగ అధికారులు, సిబ్బంది సంపూర్ణ సహకారంతోనే ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించగలిగామని కొనియాడారు. ప్రతిఒక్కరూ అంకితభావం, నిబద్ధత, మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతిని స్వీకరిస్తున్న రాధిక

18 నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

శ్రీకాకుళం అర్బన్ : ఈనెల 18 నుంచి ఆగస్టు రెండో తేదీ వరకు జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. వ్యాధి లక్షణాలను గుర్తించేందుకు ప్రతి గ్రామంలో వైద్యారోగ్యశాఖ బృందాలు పనిచేస్తాయన్నారు. చర్మంపై స్పర్శ లేని, నొప్పి , దురద లేని మచ్చలు, చర్మంపై ఎర్రని, రాగి రంగు మచ్చలు, చెవులు, వీపు, ఎదపై నొప్పి లేని బుడిపెలు, కనురెప్పలు పూర్తిగా మూయలేక పోవడం, కనుబొమ్మలపై వెంట్రుకలు రాలిపోవడం, నొప్పిగా ఉన్న నరాలు, చేతులు, పాదాలు తిమ్మిర్లు కలగడం, చల్లని , వేడి వస్తువులు గుర్తించలేకపోవడం తదితరమైనవి ఈ వ్యాధి లక్షణాలని డిఎంహెచ్ఒ బి.మీనాక్షి తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, డిసిహెచ్ఎస్ కళ్యాణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు




లోకేష్‌తో శిరీష, వెంకన్న చౌదరి

లోకేష్‌ను కలిసిన శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, పలాస సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి విజయవాడలో రాష్ట్ర ఐటి శాఖామంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పలాస అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరారు. ప్రతి చేనుకు నీరు.. ప్రతి చేతికి పని అనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని, ఇప్పటికే వంశధార నీటిని రైతులకు అందించడం జరిగిందన్నారు. పలాస ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తీర ప్రాంతం అధికంగా ఉందని, ప్రస్తుత తీరంలోని మత్స్యకార యువత అధికంగా ఉన్నారని, సిమెన్, మర్చంట్ నేవీ అంశాలపై శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్దాన ప్రాంతంలో జీడి, కొబ్బరి అధికంగా సాగవుతుందని, అందుకు అనుగుణంగా చిన్న తరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసినట్లయితే ఈ ప్రాంతంలోని మహిళలు అదనపు ఆదాయం పొంది ఆర్థికంగా పరిపుష్టి సాధించే అవకాశం ఉంటుందని వివరించారు. మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీఇచ్చినట్లు ఆమె తెలిపారు.



అన్న క్యాంటీన్ రికార్డులను పరిశీలిస్తున్న రవికుమార్

అన్న క్యాంటీన్‌ను సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలో రైతుబజార్ పక్కన అసంపూర్తి నిర్మాణంగా ఉన్న అన్నా క్యాంటీన్ భవనాన్ని సర్వ సుందరంగా సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ కె.అప్పలనాయుడును ఆదేశించారు. సోమవారం ఆయన అన్నా క్యాంటీన్ భవనాన్ని సందర్శించి గతంలో నిర్మించిన అన్నాక్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులతో మాట్లాడుతూ త్వరలో సిఎం చంద్రబాబు నాయుడు అన్నా క్యాంటీన్ ప్రారంభించి పేదలందరికీ భోజనం అందించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయని, దీనిలో భాగంగా పట్టణంలో కూడా అన్నా క్యాంటీన్ ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టి సత్వరమే భవననిర్మాణ పనులు పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. త్వరితగతిన అన్న పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేస్తామని మున్సిపల్ ఎఇ అప్పలనాయుడు ఎమ్మెల్యే రవికుమార్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినేని విద్యాసాగర్, చంద్రశేఖర్, నూక రాజు, కూన అంజనేయులు, ఎన్ని శ్రీదేవి, అన్నెపు భాస్కరరావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్‌పి ప్రేమ్‌కాజల్

బాధితులకు సత్వర న్యాయం

శ్రీకాకుళం: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా అదనపు ఎస్‌పిలు జి.ప్రేమ్ కాజల్, వి.ఉమామహేశ్వరరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో వీరు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని సిబ్బందికి అదేశించారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుంచి పలు సమస్యలపై 24 వినతులను స్వీకరించారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

నైపుణ్యాభివృద్ధి అవసరం

శ్రీకాకుళం అర్బన్: నిరుద్యోగాన్ని జయించేందుకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు దక్కించుకునేందుకు విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధిని విద్యార్థులు పెంపొందించుకోవాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు పిలుపు నిచ్చారు. కళాశాలలో అంతర్జాతీయ నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐక్యూఎసి, ఆర్థికశాస్త్ర విభాగం సంయుక్తంగా సోమవారం అవగహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు స్వయంశక్తితో పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని హితవు పలికారు. ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ పద్మావతి మాట్లాడుతూ ఎన్నో నూతనాంశాలు తెలుసు కునేందుకు సదస్సులు దోహదపడతాయన్నారు. సదస్సులో జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజరు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య నుంచి బయట పడడానికి ప్రతిఒక్కరూ పారిశ్రామికంగా ఎదగలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజరు సూర్య కిరణ్, ఇండస్ట్రీ ప్రమోటర్ అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్ నారాయణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా యువజన సంఘం

పలాస: విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు యువజన సంఘం అండగా నిలుస్తూ ఆర్థికంగా, సహాయ సహకారాలు అందిస్తున్నామని జగదీశ్వర సంఘం అధ్యక్షులు బొడ్డు కాంతారావు అన్నారు. మండలం బొడ్డపాడుకు చెందిన వలస కార్మికులైన అండమాన్‌లో జగదీశ్వర సంఘాన్ని ఏర్పాటు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా సోమవారం 10వ తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన 16 మంది విద్యార్థులు, ఏడుగురు క్రీడాకారులను ఘనంగా సన్మానం చేశారు. అనంతరం వారి ఉన్నత చదువులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండమాన్ నికోబార్‌లో చదువుకున్న విద్యార్థులకు తమ సంఘం అండగా ఉంటుందన్నారు. మద్దిల శంకరరావు, గేదెల ధర్మారావు, కూర్మారావు, ఎం.వెంకట్, మద్దిల రమేష్, సుందరయ్య పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న కాంతారావు

జ్వరాలతో వణుకుతున్న గ్రామాలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పలు గ్రామాల్లో విష జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. మండలంలోని కొల్లి వలస, చీడివలస, అన్నంపేట, లచ్చయ్యపేట, తోటవాడ తదితర గ్రామాల్లో పలువురు విపరీతమైన కాళ్లపీకులు, నీరసంతో పాటు జ్వరంతో బాధపడుతున్నారు. కొల్లివలసలో ఎస్‌సి కాలనీలో శనగల ఎరకయ్య, లక్ష్మి, సౌర దుర్గారావు, బాబరవెల్లి రామారావుతో పాటు గ్రామంలో ఉన్న నారాయణ శెట్టి జనార్ధన, వెంకట మణికంఠ మరికొంత మంది జ్వరంతో మంచమెక్కారు. మరికొంత మంది గ్రామస్తులు వైద్యం కోసం కొల్లివలస ప్రైవేట్ ఆస్పత్రితో పాటు పాలకొండ ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. తమ గ్రామాల్లో గత కొన్ని రోజులుగా తాము జ్వరాలతో బాధపడుతున్నామని, అయినప్పటికీ వైద్య సిబ్బంది జాడ కనిపించడం లేదని గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్న కారణంగా రోగాలబారిన పడుతున్నామని తెలిపారు. దీనికితోడు గ్రామంలో అపారిశుధ్యం నెలకొందని, కాలువలు లేకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లడంతో పాటు వ్యాధులు సంక్రమి స్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. అయితే ప్రస్తుతం వ్యాధుల వ్యాప్తి చెందుతున్నప్పటికీ పంచాయతీ పాలకవర్గంగాని ఇటు వైద్య సిబ్బందిగాని అందుబాటులో లేకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని, ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని చెబుతున్నప్పటికీ అందులో వాస్తవం లేదని గ్రామస్తులు తెలిపారు. సకాలంలో వైద్యం అందక పోవడంతో తాము వైద్యంకోసం ఆమదాలవలస, పాలకొండ పట్టణాల్లో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కొల్లివలసలో అపారిశుధ్యంగా ఉన్న కాలువ

జ్వరాలు వాస్తవమే

కొల్లివలసలో జ్వరాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న కారణంగా వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఎప్పటికప్పుడు గ్రామంలో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. సబ్ సెంటర్లలో సిబ్బంది అందుబాటులో ఉన్నారు. జ్వరాలు ఉన్నట్లయితే వైద్య సిబ్బందిని సంప్రదించాలి.

- రోజా, పిహెచ్‌సి వైద్యాధికారి, గుత్తావల్లి



ఎస్‌సి వీధిలో రహదారిపై మురుగునీరు

న్యాయం చేయాలి

వివేకానంద విగ్రహం వద్ద మహిళ నిరసన

ప్రజాశక్తి- పలాస

భర్త వేధింపులు నుంచి తనను కాపాడమని పోలీసుల వద్ద మెరపెట్టుకుంటే, ఆ పోలీసులే తనకు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఓ మహిళ రోడ్డెక్కింది. న్యాయం చేయాలని వివేకానంద విగ్రహం వద్ద సోమవారం నిరసనకు దిగింది. వివరాల్లోకి వెళ్తే పలాస అన్నపూర్ణ ఆశ్రమం వీధికి చెందిన నెయ్యిల అరుణకు, ప్రయివేటు ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవిస్తున్న వజ్రపుకొత్తూరు మండలం సుంకర జగన్నాధపురానికి చెందిన నెయ్యిల లోకేష్‌తో 2019లో వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. పెళ్లయిన రెండు నెలలకే భర్త లోకేష్ నుంచి తనకు వేధింపులు మొదలయ్యాయని అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుడప్పుడు సైకోలా ప్రవర్తించేవాడిని, లోకేష్ పెడుతున్న టార్చర్ భరించలేక పెద్దమనుషులను అనేకసార్లు ఆశ్రయించినట్లు తెలిపింది. పెద్దమనుషులు సైతం తన ఆవేదన అర్థం చేసుకోకుండా ఇద్దరు కలిసి ఉండాలంటూ, లేకుంటే కోర్టులో తేల్చుకోవాలని సర్ది చెప్పి పంపించేవారని, రోజురోజుకి భర్త లోకేష్ వేధింపులు పెరిగిపోవడంతో భరించలేక సుంకరి జగన్నాధపురం నుంచి వచ్చి పలాస అన్నపూర్ణ ఆశ్రమవీధిలో కన్నవారి ఇంట్లో ఉంటున్నట్లు అరుణ తెలిపింది. భర్త లోకేష్ నుంచి తనకు రక్షణ కల్పించాలని, నాలుగేళ్ల కుమారుడిని తనకు ఇప్పించాలని పలుమార్లు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసినా పట్టించు కోకపోవడంతో జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేసి, తన గోడును మెరపెట్టుకున్నానని, ఎస్‌పి ఆదేశాల మేరకు కాశీబుగ్గ పోలీసులు తన ఫిర్యాదును స్వీకరించి, తన కుమారుడును ఇప్పించారని చెప్పింది. తన కొడుకు తన వద్దకు వచ్చాడనే సంతోషం ఎక్కువ సేపు లేదని, తన కుమారుడిని సుంకరి జగన్నాధపురంలోని తండ్రి వద్దకు పంపించాలని, ఆ ఊర్లో సంబరాలు ఉన్నాయని ఒకసారి, మరోసారి లోకేష్ తండ్రికి బాగోలేదని, మనవడుకి చూడాలంటున్నాడని కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ నుంచి తనకు ఫోన్లు వస్తున్నాయని, పోలీసుల అండతో భర్త లోకేష్ తనపై దాడి చేసి తన వద్ద ఉంటున్న కుమారుడిని తీసుకొని వెళ్లిపోయినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా పోలిసు అధికారులు చొరవ చూపి తన కుమారుడును తన వద్దకు పంపించేలా చూడాలని కోరారు. ఈ విషయమై కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడును వివరణ కోరగా కుమారుడిని తండ్రి చూసుకోవడానికి వీలుగా వారి మధ్య ఒప్పందం ఉందని, ఆ క్రమంలోనే భర్త తీసుకువచ్చారన్నారు. భర్త తండ్రి చావు బతుకుల్లో ఉన్న కారణంగా చివరి చూపయినా చూపిస్తాని భర్త లోకేష్ కోరారన్నారు. భార్యా భర్తల వ్యవహారంలో తాము ఎవరిపక్షాన ఉండమని, చట్టప్రకారం అంతా జరుగుతుందని స్పష్టం చేసారు.



నిరసన తెలుపుతున్న అరుణ

న్యాయవాదుల ర్యాలీ

టెక్కలి : ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరు హెల్మెట్ తప్పకుండా ధరించాలని కోరుతూ టెక్కలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు సూచనలతో ర్యాలీ చేపట్టినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వాల వివేకానంద తెలిపారు. కోర్టు సముదాయాల నుంచి స్థానిక అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ జరిగింది. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రమాదాల నివారణ దృష్ట్యా హెల్మెట్ ధరించాలని నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానందతో పాటు న్యాయవాదులు పి.సాయిరాజ్, పి.ఆనందరావు, బి.శ్రీనివాసరావు, పేడాడ చంద్రశేఖర ఆజాద్, రాజం నాయుడు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు



మాట్లాడుతున్న బిఆర్‌ఎయు విసి రజని

వర్శిటీ ప్రతిష్ట పెంచాలి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పరిశోధనలు, అధ్యయనాల దిశగా డా.బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయాన్ని పయనింపజేస్తామని వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. డా.బిఆర్ ఎయు రీసెర్చి ఫోరమ్ వర్శిటీలో నూతనంగా సోమవారం ప్రారంభించి మాట్లాడారు. అధ్యాపకులు, బోధనతో పాటు మారుతున్న కాలానికి అనుగుణంగా వారి బోధనా సబ్జెక్టుల్లో పరిశోధనలు, వ్యాసాలు ప్రచురణపై దృష్టి సారించాలన్నారు. నూతన సాంకేతికతను వినియోగించుకొని, పలు జాతీయ జర్నల్స్‌లో పరిశోధనా, సమకాలిన, విశ్లేషాత్మకమైన వ్యాసాలు ప్రచురించి డా.బిఆర్ ఎయు ఖ్యాతిని మరింతగా వ్యాప్తి చేయాలన్నారు. వర్శిటీ రెక్టార్, రీసెర్చి ఫోరమ్ చైర్మెన్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ప్రిన్సిపాళ్లు డా.ఎం.అనురాధ, డా. సిహెచ్.రాజశేఖర్, రీసెర్చి ఫోరమ్ చీఫ్ కన్వీనర్ డా. ఎస్.సంతోష్ రంగనాథ్, పలువురు డీన్లు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

కేన్సర్‌పై పరిశోధనా పుస్తకం ఆవిష్కరణ

వర్శిటీ రిజిస్ట్రార్, బయోటెక్నాలజీ సీనియర్ అధ్యాపకురాలు ఆచార్య పి.సుజాత సంపాదకత్వంలో కేన్సర్ నివారణపై ప్రచురితమైన పరిశోధన్మాతక పుస్తకాన్ని విసి రజని ఆవిష్కరించారు. బ్రిటన్‌కు చెందిన ఎల్సవేర్ సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. కేన్సర్‌లో అతి సాధారణ రకమైన 'హెపాటో సెల్యులర్ కార్సినోమా నిర్ధారణకు ఉపయోగపడే థెరానోస్టిక్స్ రేడియో ధార్మిక ఔషదం, ఖచ్చితత్వమైన వైద్య నివారణ తదితర అంశాలను ఈ పుస్తకంలో పొందు పరిచారు. అదేవిధంగా ఊపిరితిత్తులు, కాలేయం తదితర కేన్సర్‌లకు కారణాలు, రకాలు, సమస్యలు, చికిత్సలు వంటి వాటిని ప్రచురణ ద్వారా ఆచార్య పి.సుజాత తెలియజేశారు.

జిల్లాకు 'గరిమెళ్ల' పేరు పెట్టాలి

ప్రజాశక్తి- పోలాకి

స్వాతంత్ర్య సమర యోధులు, స్వర్గీయ గరిమెళ్ల సత్యనారాయణ పేరును జిల్లాకు పెట్టాలని గరిమెళ్ల ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎ.ఎన్.భుక్త, బాడాన రాజులు ప్రబుత్వానికి కోరారు. మండలంలోని స్వగ్రామం ప్రియాగ్రహారంలో గరిమెళ్ల విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో సిక్కోలుకు స్థానం కల్పించిన గరిమెళ్ల సత్యనారాయణ పేరు జిల్లాకు పెట్టాలని డిమాండ్ చేశారు. గరిమెళ్ల జయంతి, వర్ధంతులను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలన్నారు. గరిమెళ్ల పుట్టిన ఈ నేలపై పుట్టిన ప్రతిఒక్కరూ ధన్యజీవులమని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సింహాభట్ల నాగకుమారి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వేశ్వరరావులు మాట్లాడుతూ గరిమెళ్ల పేరిట ఉన్న ఉన్నత పాఠశాల, కళాశాలను అన్ని రకాలుగా అభివృద్ధికి సహకరించాలని కోరారు. సుదూరం నుంచి వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం బోరుభద్ర నుంచి ప్రత్యేక బస్సు నడపాలని కోరారు. మాజీ సర్పంచ్ లావేటి కృష్ణారావు మాట్లాడుతూ గరిమెళ్ల పేరిట ప్రియాగ్రహారంలో శాఖాగ్రంథాలయం మంజూరు చేయాలని కోరారు. గరిమెళ్ల ట్రస్టు సభ్యులు ఐ.గణపతిరావు మాకొద్దీ తెల్లదొరతనం పాట పాడి వినిపించారు. అనంతరం ఇంటర్, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు సీపాన అనూష, దుద్ద భార్గవి, బూరెళ్ల నవ్య, టి.రోహిణిలకు ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గరిమెళ్ల ట్రస్టు సభ్యులు దుబ్బ కోటేశ్వరరావు, మడ్డు అప్పలరాజు, రామారావు, మడ్డు అప్పయ్య, నాగేంద్ర, గోపి, ధనుంజయరావు పాల్గొన్నారు.



విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న సభ్యులు

ఆదుకుంటాడనుకున్న కొడుకు అనంతలోకాలకు...

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి
- శ్రీరామనగర్ కాలనీలో విషాదఛాయలు

వారిది నిరుపేద చేనేత కార్మిక కుటుంబం... మగ్గం ఆడనిదే ముద్ద దిగని పరిస్థితులు. భార్యభర్తలు ఇద్దరూ మగ్గంపై పనిచేసి వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటూనే కొడుకును చదివించారు. కొడుకు ప్రయోజకుడై తమకు అండగా ఉంటాడనుకుంటే రహదారి ప్రమాదం రూపంలో మృత్యువు కాటేసి కానరాని అనంత లోకాలకు వెళ్లిపోయాడు.

ప్రజాశక్తి - పొందూరు

పట్టణంలోని జూనియర్ కళాశాల రహదారిలో సోమవారం జరిగిన ప్రమాదంలో తండ్యాం పంచాయతీ శ్రీరామనగర్ కాలనీ (తండ్యాంమెట్ట)కు చెందిన కాకర్ల దుర్గాప్రసాద్ (26) మృతి చెందగా, మరో యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీ సుల వివరాల మేరకు శ్రీరామనగర్ కాలనీకి చెందిన కాకర్ల దుర్గాప్రసాద్, కావూరి చిన్నారావులు ద్విచక్ర వాహనంపై పొందూరు నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో ఒడిశాకు చెందిన కోళ్ల వ్యాన్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిన దుర్గా ప్రసాద్ తలపై నుంచి వ్యాన్ వెళ్లడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందగా, చిన్నారావుకు చేయి విరగడంతో పాటు తీవ్రగాయాలు కాగా స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం శ్రీకాకుళం తరలించారు.



రోదిస్తున్న మృతుని తల్లి కొండమ్మ, బంధువులు (ఇన్‌సెట్‌లో దుర్గాప్రసాద్ (ఫైల్)

పూజా సామాగ్రి కొనుగోలుకు వచ్చి...

మంగళవారం ఇంటి వద్ద అమ్మవారి వారం చేసేందుకు అవసరమైన సామాగ్రి కొనుగోలు చేసి తీసుకువస్తానని తల్లిదండ్రుల కొండమ్మ, కృష్ణలకు చెప్పి పొందూరు వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడు ఇటీవల విజయవాడలో తన సోదరుడు దగ్గర కారు డ్రైవింగ్ నేర్చుకున్నాడు. రహదారి ప్రమాదంలో మృత్యువాత పడిన కొడుకును చూసి తల్లిదండ్రుల రోధనను ఆపడం ఎవరితరం కాలేదు. ప్రమాద విషయం తెలియడంతో కుటుంబ సభ్యులతో పాటు, స్నేహితులు, బంధువులు, శ్రీరామనగర్ కాలనీకి చెందిన వారంతా సంఘటన స్థలం వద్దకు చేరుకుని కన్నీటి పర్యాంతమయ్యారు. దీంతో కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ సంఘటనపై గాయ పడిన కావూరి చిన్నారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ ఇ.వి.రమణ తెలిపారు.

భార్యపై కత్తితో దాడి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో మూడియా వీధిలో భార్యభర్తల మధ్య గొడవ జరిగి భర్త భార్యపై కత్తితో దాడి చేయడంతో భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీస్ అధికారులు అందించిన వివరాల మేరకు పట్టణంలోని మూడియా వీధిలో సుదర్శన శ్రీను, సుదర్శన దుర్గ ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నారు. భర్త ఎక్సైజ్ శాఖలో ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్యపై అనుమానంతో భార్యా, భర్తల మధ్య తరచూ చిన్న చిన్న గొడవలు జరుగుతుండేవి. ఆదివారం రాత్రి భార్య, భర్తల మధ్య భర్త జీతం విషయంలో వాగ్వివాదం చోటుచేసుకుంది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న శ్రీను భార్యపై ఇంట్లో ఉన్న కత్తితో దాడి చేసాడు. దీంతో తీవ్ర గాయాల పాలైన ఆమెను స్థానికులు స్థానిక పిహెచ్‌సికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం బరంపూర్ తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ గోపాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. నిందితుడు పరారిలో ఉన్నాడు.



గాయపడిన దుర్గ



చెక్కును అందజేస్తున్న డాక్టర్ రెడ్డీస్ ప్రతినిధులు

'రెడ్డీస్' పరిశ్రమ ఆర్థికసాయం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని పైడిభీమవరం పంచాయతీ సరగడపేటకు చెందిన యాగటి సూర్యనారాయణ గుండె సంబంధిత వ్యాధి రావడంతో ఆపరేషన్‌కు ఎక్కువ ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో వారికి ఆర్థిక స్తోమత లేక సర్పంచ్ ప్రతినిధి రౌతు శ్రీనివాసరావుతో ఆర్థిక ఇబ్బంది కోసం మొరపెట్టుకున్నారు. శ్రీనివాసరావు ఈ విషయం డాక్టర్ రెడ్డి ల్యాబ్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి వారికి సాయమందించాలని కోరారు. వెంటనే స్పందించి డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ క్లస్టర్ హెడ్ కె.వి.ఎస్.ఎన్.రాజు రూ.లక్ష చెక్కును సూర్యనారాయణ భార్య సూరమ్మకు సోమవారం అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ డిపార్ట్మెంట్ ప్రతినిధులు జోగారావు, దీపక్ ఉన్నారు.



వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న అధికారులు

వాటర్ ట్యాంకు పరిశీలన

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని నెలవంకలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల సముదాయంలో ప్రమాదకరంగా ఉన్న తాగునీటి ట్యాంకు సంబంధించి సోమవారం ప్రజాశక్తిలో 'ఏ క్షణంలోనైనా' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం సాయంత్రం ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఎంఇఒ ధనుంజయ మజ్జి తాగునీటి ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలల సముదాయంలోని తాగునీటి ట్యాంకు పరిశీలించినట్టు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎన్.గంగయ్య, కె.శివరామప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరమ్మ

నిందితుడిని శిక్షించాలి

పలాస : విజయనగరం జిల్లా రాంభద్రాపురంలో ఆరు నెలల పసికందుపై 40 ఏళ్ల వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడ్డాడం సభ్య సమాజం తలదించుకుంటుందని, అటువంటి వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు బతకల ఈశ్వరమ్మ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని సూదికొండ కాలనీలో సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆరు నెలల పసికందు నుంచి 60 ఏళ్ల వృద్ధులపై అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్భయ, దిశ వంటి చట్టాలు ఎన్ని తెచ్చినా మద్యపానం నిషేధించకుండా, గంజాయి మత్తు పానీయాలను అరికట్టకుండా హింస ప్రవృత్తి సమాజంలో అరికట్టడం అసాధ్యమని అన్నారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడానికి గల కారణాలను అన్వేషించకుండా వ్యవస్థ మూలాల్లోకి తొంగు చూడకుండా చట్టాల పేరుతో నిందితులు శిక్ష నుంచి తప్పించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెతో పాటుగా జిల్లా కార్యవర్గ సభ్యులు కంప సరస్వతి, గౌరమ్మ, సుందరమ్మ ఉన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న ఎపిడి లోకేష్

ఉద్యానవనాల పెంపకానికి ప్రాధాన్యం

లావేరు : ఉపాధిహామీ పథకంలో ఉద్యనవనాల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎచ్చెర్ల క్లస్టర్ ఎపిడి లోకేష్ అన్నారు. సోమవారం పెదరావుపల్లి, చినయ్యపేట, సహపురం, మురపాక, కేశవ రాయునిపాళెం గ్రామాల్లో చేపట్టిన ఉద్యనవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న ఈ సమయంలో మొక్కలు పెంపకానికి అనుకూలమన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు ఉచితంగా కొబ్బరి, మామిడి, జీడీ, మునగ, సపోటా, జామ, పామాయిల్ తదితర రకాల మొక్కలు ఉచితంగా సరఫరాతో పాటుగా మొక్కలు సవరక్షణ కోసం మూడేళ్ల పాటు నెలవారీ నిర్వహన ఖర్చులు చెల్లించడం జరుగు తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూగర్భ జలాలు పెంపొందిం చేందుకు పొలాల్లో ప్రతిరైతు ఒక్కో ఫారం ఫండ్ తవ్వించాలన్నారు. భవిష్యత్‌లో నీటికొరత లేకుండా ఉంటుందన్నారు. గ్రామాల్లో సాగునీటి కాలువల పనులు చేపట్టాలని ఉపాధి సిబ్బందికి ఆదేశించారు. ఎపిఒ ఆర్.సత్యవతి, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

బాధితురాలికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం: ఇటీవల ఒడిశా రాష్ట్రంలోని సున్నాపూర్ బీచ్ వద్ద జరిగిన ఘర్షణలో ఇచ్ఛాపురం మండలం కేదారిపురానికి చెందిన ఆశి బాలు మృతి చెందడడంతో బాధిత కుటుంబానికి గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు ఆర్థికసాయం అందించారు. బాలు మృతి చెందడంతో ఆమె తల్లి సావిత్రి ఒంటరి కావడంతో ఆమెను ఆర్థికంగా ఆదుకునేందుకు కేదారిపురం గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు రూ.41,100 ఆర్థికసాయం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు


అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

ప్రెస్‌క్లబ్ భవనానికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

స్థానిక ప్రెస్‌క్లబ్ భవనానికి నిధులు మంజూరు చేయాలని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కూన సుదర్శన ఆధ్వర్యంలో సభ్యులు రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును సోమవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో మమేకమై ప్రజాసమస్యలు ప్రభుత్వానికి తెలియజేస్తూ కష్టపడిన జర్నలిస్టులకు ఫలితం ఉంటుందన్నారు. అలాగే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరుకు కృషి చేస్తామన్నారు. ప్రెస్‌క్లబ్ భవనానికి నిధులు మంజూరు చేస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు బగాది వాసుదేవరావు, సుంకు గోపినాథ్, మార్పు పద్మలోచన, ఎల్.రమణ, డి.ఈశ్వరరావు, రాజేష్, దవళ కిరణ్, ఉదయ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని ఎంఇఒ అప్పారావు అన్నారు. సోమవారం ప్రభుత్వం ఆదేశాల మేరకు నేను బడికి పోతా కార్యక్రమాన్ని ఎంఇఒ పర్యవేక్షణలో పర్యవేక్షణలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బంది, హెచ్‌ఎం ఎస్.విశ్వనాథం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులతో పాఠశాల నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించి బడిఈడు పిల్లలు పనిలో కాకుండా బడిలోనే ఉండాలని అవగాహన కల్పించారు.


సాయిస్ఫూర్తిని సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

విద్యార్థులకు ఆమె 'స్ఫూర్తి'

కవిటి: పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సాయిస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి మార్పు సాయిస్ఫూర్తి గౌహతి ఐఐటిలో బిటెక్ సీటు సాధించిన సందర్భంగా సోమవారం విద్యార్థినితో పాటు ఆమె తండ్రిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2022లో తమ పాఠశాల టాపర్‌గా నిలిచిన సాయిస్ఫూర్తి విద్యాదాన్ స్కాలర్ షిప్ రూ.60 వేలుకు ఎంపికైనట్లు గుర్తుచేశారు. అలాగే ఇంటర్మీడియట్ ఓ ప్రయివేట్ కళాశాలలో చదివి అక్కడా ప్రథమ స్థానంలో నిలిచి రూ.50 వేలు నగదు బహుమతి అందుకున్నట్టు తెలిపారు. అదే ఉత్సాహంతో జెఇఇ అడ్వాన్స్‌లో తొలి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు సాధించి గౌహతి ఐఐటిలో సీటు సాధించడం మనందరికీ గర్వకారణమన్నారు. సాయిస్ఫూర్తి ఇదే ఉత్సాహంతో చదువు కొనసాగించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహనా ర్యాలీ

సోంపేట: ప్రమాదాల నియంత్రణకు ప్రాణాలు రక్షించుకునేందుకు వాహనదారులు హెల్మెట్ వినియోగం తప్పనిసరని సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాస్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన హెల్మెట్ వినియోగంపై కోర్టుల సముదాయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు విద్యార్థులతో సోమవారం అవగాహనా ర్యాలీ చేపట్టారు. అలాగే జూనియర్ సివిల్ జడ్జి ఎ.రాము ఆధ్వర్యాన కోర్టుల సముదాయం నుంచి గాంధీ మండపం వరకు మరో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారంతా హెల్మెట్లు ధరించి వాహనాలను నడిపారు. అనంతరం వారు మాట్లాడుతూ హెల్మెట్ వాడకపోవడం నేరం కింద పరిగణించాల్సి వస్తోందని అన్నారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు సర్వేశ్వరరావు, న్యాయ వాదులు గోవర్ధనరావు, లక్ష్మీనారాయణ, గోపాలరావు, కె.రాజు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని మర్రిపూడి-సిలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఆధ్వర్యాన సోమవారం మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యతను తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సలాన మోహనరావు, సర్పంచ్ రవ్వల అనురాధ, గణపతిరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ గౌడ, టిడిపి మండల మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి, ఎంపిటిసి ప్రతినిధులు నంబాల వెంకటరావు, కదంబల పైడిరాజు, బూర్ల లలితకుమారి, బొచ్చు ప్రసాదరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వరరెడ్డి, సలాన శరత్‌కుమార్‌రెడ్డి, మాలతి శ్రీధర్, దుక్క బాలరాజు, ఎపిఒ టి.రవి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ నాయకులు భాస్కరరావు, జగదీశ్వరరావు, శ్రీనివాసరావు కోరారు. మండలానికి వచ్చిన ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. చాలీచాలని వేతనాలతో


కొత్తూరు : మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

కుటుంబాలను పోషిస్తున్నామని అన్నారు. కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. అర్హత, అనుభవాన్ని బట్టి ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. పనిదినాల లక్ష్యాల నుంచి తప్పించాలన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్, చాణుక్య, ఎస్.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ ఆర్‌అండ్ఆర్ కాలనీలో ఎమ్మెల్యే గోవిందరావు మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, సర్పంచ్‌లు దాసునాయుడు, పుచ్చ అప్పారావు, ఎ.శంకరరావు, కొయిలాపు శ్రీనివాసరావు, వై.దాసునాయుడు, యు.గాంధీ, ఎంపిటిసి వడ్డి గౌరి, ఎల్.ఇందిర, ఎంపిడిఒ త్రివిక్రమరావు, ఎపిఒ ప్రమలత, టి.తిరుపతిరావు, ఎ.మాధరావు పాల్గొన్నారు.

పాతపట్నం : పాతపట్నం మండలం రౌతులక్ష్మీపురం, హిరమండలం మండలం సుభలయ్ ఆర్‌అండ్ఆర్ కాలనీ, ఎల్‌ఎన్‌పేట మండలం బొర్రంపేట గ్రామాల్లో ఎమ్మెల్యే మొక్కలను నాటారు. అనంతరం మండలంలోని సవరసిద్ధమడుగుకు చెందిన మాజీ సర్పంచ్ కేలం కామేశ్వరరావు కొద్దిరోజుల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో పాతపట్నం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వెళ్లి పరామర్శించారు.

పొందూరు: మండలంలోని తోలాపిలో శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో యువజన దినోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. తోలాపి నుంచి అలమాజీపేట వరకు గల రహదారిలో సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షులు రామచంద్రరావు వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో సత్యసాయిసేవా సమితి జాయింట్ యూత్ కో-ఆర్డినేటర్ సాయికృష్ణ, జోనల్ యూత్ కో-ఆర్డినేటర్ చరణ్, జిల్లా వటవృక్ష ఇన్‌ఛార్జి రమణమూర్తి, జిల్లా భజన్స్ ఇన్‌ఛార్జి వినోద్, హరిబాబు, పెద్దబాబు, సమితి సేవాద్ సభ్యులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య కాంక్షకు ప్రతిరూపం తిలక్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వాతంత్ర్య కాంక్షకు ప్రతిరూపంగా నీతి, నిజాయితీలకు నిలువటద్దంగా స్వాతంత్ర్య సమరయోధులు, తొలి పార్లమెంట్ సభ్యులు కె.ఎస్.తిలక్ నిలుస్తారని వక్తలు పేర్కొన్నారు. నగరంలోని శాంతినగర్ కాలనీ, గాంధీ మందిరం, స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో తిలక్ 104 జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రొఫెసర్ నిక్కు అప్పన్న, అవధాన పండితులు పైడి హరనాథరావు, గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు జామి భీమశంకర్, కొంక్యాన వేణుగోపాల్ తదితరులు మాట్లాడారు. స్వాతంత్రోద్యమంలో గాంధీజీ పిలుపునందుకొని యువతను ఉత్తేజ పర్చడంలో తిలక్ కీలకపాత్ర వహించారన్నారు. పి.వి.జి.రాజు, జయప్రకాష్ నారాయణ్ సాన్నిహిత్యంతో సోషలిస్టు పార్టీ తరుపున తొలి పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైన తిలక్ అత్యధిక మెజార్టీతో గెలుపొంది నెహ్రూ మన్ననలు పొందారన్నారు. పి.వి.రాజు ఆస్థానంలో దివాన్, రైల్వే సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా పనిచేసిన తిలక్ బంధుప్రీతి,


నివాళ్లర్పిస్తున్న గాంధీ మందిరం నిర్వాహకులు

అవినీతికి తావు లేకుండా జీవితాన్ని సాగించారన్నారు. కార్యక్రమంలో మందిర కమిటీ ప్రతినిధులు కొమ్ము రమణమూర్తి, మెట్ట అనంతంభట్లు, సువ్వారి రాజారావు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న పరమేశ్వరరెడ్డి

పశువైద్యాధికారిని నియమించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల కేంద్రంలోని పశువైద్యశాలకు రెగ్యులర్ పశువైద్యాధికారిని నియమించాలని తెలుగు యువత మండల అధ్యక్షులు బసవ పరమేశ్వరరెడ్డి కోరారు. ఈ మేరకు తహశీల్దార్ టి.జానకమ్మను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువైద్యం అందకపోవడంతో పశువులు రోగాల బారిన పడి మృత్యువాత పడుతున్నాయని అన్నారు. గత ఐదేళ్లుగా పశువైద్యాధికారి లేకపోవడంతో పాతపట్నం మండలం కొరసవాడ నుంచి డెప్యుటేషన్‌పై ఇక్కడకు నియమించారని అన్నారు. తక్షణం స్పందించి రెగ్యులర్ పశువైద్యాధికారిని నియమించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో రైతులు పాల్గొన్నారు.

సమాజ సేవే లక్ష్యం

ప్రజాశక్తి- సోంపేట

సేవే లక్ష్యంగా నిరుపేదలకు ఎస్‌ఎస్ ఫౌండేషన్ ద్వారా సేవ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని వ్యవస్థాపకులు డాక్టర్ దుద్ది శ్రీనివాసరావు అన్నారు. స్థానిక డాక్టర్ శ్రీనివాస్ కళ్యాణ మండపం నిర్మాణానికి రూ.2 లక్షలు విరాళాన్ని సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇకపై తన సంపాదనలో 50 శాతం నగదును బ్యాంకులో డిపాజిట్ చేస్తూ... దానినుంచి వచ్చే వడ్డీ, తన సంపాదనలో కొంత వరకు సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తానని తెలిపారు. అనంతరం కళ్యాణ మండపం ఆవరణలో మొక్కలను నాటారు.

గ్యాస్ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- మందస

హెచ్‌పి గ్యాస్ సేవలను వినియోగించుకోవాలని సర్పంచ్ టి.సవరయ్య, ఎంఇఒ బాబూరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు మురళీకృష్ణ, విశ్రాంత ఆర్ నర్సింహమూర్తి అన్నారు. మండలంలోని అంబుగాంలో ఎల్‌పిజి కొత్త కనెక్షన్లు, రెండో సిలెండర్ల పంపిణీ, ఇకెవైసిపై సోమవారం మెగా మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోంపేట గ్యాస్ ఏజెన్సీ అందిస్తున్న సేవలను అభించారు. అనంతరం గ్యాస్ మొదటి కస్టమర్లు ఎం.పట్నాయక్, వైశ్యరాజు జనార్థనరావులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌పి గ్యాస్ డీలర్ కొంచాడ సాయినాథ్ పాల్గొన్నారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్‌కు ఘన నివాళి


నివాళ్లర్పిస్తున్న విసి రజని తదితరులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మహిళా అభ్యున్నతికి, పేదల సంక్షేమానికి, జాతీయ సమైక్యతకు ఎనలేని కృషి చేసిన డా.దుర్గాబాయి దేశ్‌ముఖ్ జీవితం ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని డా.బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. దుర్గాబాయి 115 వ జయంతి కార్యక్రమాన్ని వర్సిటీలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ పలు పదవుల ద్వారా సమాజ సేవలో చివరివరకూ గడిపిన స్ఫూర్తిప్రధాత దుర్గాబాయి అని కొనియాడారు. ధీరవనితగా, ఆంధ్రా మహిళా వ్యవస్థాపకురాలిగా, పద్మవిభూషణ్ గ్రహీతగా ఖ్యాతిగాంచిన దుర్గాబాయి ఆంధ్ర విశ్వవిద్యాలయం తొలి విద్యార్థిని కావడం ఎంతో గర్వకారణమన్నారు. ముందుగా దుర్గాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, కళాశాలల ప్రిన్సిపాళ్లు డా.ఎం. అనురాధ, సిహెచ్.రాజశేఖర్, ఒఎస్‌డి డా.యు.కావ్యజ్యోత్స్న, విద్యార్థులు పాల్గొన్నారు.

నవధాన్యాలు సాగు చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

నవధాన్యాలు సాగు చేసి నేల ఆరోగ్యాన్ని కాపాడండాలని ప్రకృతి వ్యవసాయ రీజినల్ టెక్నికల్ అధికారి హేమ సుందర్ రైతులకు సూచించారు. సోమవారం రణస్థలంలో పెద్దింటి రాజేశ్వరికి చెందిన రెండు ఎకరాల కొబ్బరి తోటలో గత రెండేళ్ల నుంచి నవధాన్యాలు సాగు చేస్తున్నారు. అలాగే ఈ ఏడాది కూడా ఈ రెండెకరాల్లో నవధాన్యాలు సాగు చేస్తూ తన చుట్టూ ప్రక్కల ఉన్న రైతులతో కూడా ఈ నవధాన్యాలు సాగుకు అవగాహన పరిచారు. ఈ సందర్భంగా హేమసుందర్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా నవధాన్యాలు సాగు చేయడం వలన ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా ఎటిఎం నమూనా, మొక్కజొన్నలో ఎ


నవధాన్యాల సాగు పరిశీలన

గ్రేడ్ నమూనాపై రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి తెలిపారు. అలాగే నవధాన్యాల సాగుతో నేల సారవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పెద్దింటి రాజేశ్వరి, కొయ్యాల రాంబాబు, గెడ్డపు రమణమ్మ, గులివెందుల సురేష్, రైతులు పాల్గొన్నారు.

'తెప్పల'కు పురస్కారం


పురస్కారాన్ని అంటుకుంటున్న కృష్ణమూర్తి

ప్రజాశక్తి- పలాస

శ్రీకాకుళం అరసవల్లిలో సూర్యనారాయణ స్వామి దేవస్థానం, సుమిత్ర కళా సమితి సంయుక్త ఈ నెల 10 నుంచి 14 వరకు అపర్ణ ద్విశతావధాన కళా విలాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలాసకు చెందిన జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి పురస్కారం లభించింది. అవధాని డాక్టర్ బులుసు అపర్ణ, సభా సంచాలకులు డాక్టరు పేరి రవికుమార్, సంస్కృత శతావధాని బ్రహ్మశ్రీ ప్రభాకర శర్మ, సుమిత్ర కళా సమితి అధ్యక్ష, గౌరవాధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ, డాక్టర్ కొంచాడ సోమేశ్వర రావులు కృష్ణమూర్తికి స్వామివారి చిత్రపటం, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి, దుశ్శాలువ కప్పి సన్మానించారు. పలాస- కాశీబుగ్గ లయన్స్ క్లబ్ అధ్యక్షులు హనుమంతు ఎండుదొర, సభ్యులు జనజాగృతి అధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్, ఉత్తరాంధ్ర రచయితల వేదిక అధ్యక్షులు లండ రుద్రమూర్తి ఆయనకు అభినందనలు తెలిపారు.


అన్నప్రాసన చేస్తున్న హెచ్‌ఎం షణ్ముఖరావు

అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో మండపల్లి పంచాయతీ భవానీపురం అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎచ్‌ఎం ఎం.షణ్ముకరావు, ఉపాధ్యాయులు సీమల కృష్ణారావు, అంగన్వాడీ కార్యకర్త బి.నరసమ్మ, హెల్పర్ తార, చిన్నారుల తల్లులు దివ్వల కుమారి, ఈశ్వరమ్మ, మీనమ్మ, మట్ట శిల్ప, దేవి తదితరులు పాల్గొన్నారు.


పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న విద్యార్థులు

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి- కవిటి

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు నివారించవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాజేశ్వరరావు అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాలలో సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను విద్యార్థులు తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పిఒ జె.పాపారావు, అధ్యాపకులు జి.విష్ణుమూర్తి, పి.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన అర్జీ కామరాజు కుటుంబానికి యువతరం సేవాసమితి సభ్యులు ఆర్థికసాయం అందించారు. మే 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలతో వారం రోజులకుపైగా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మరణించాడు. వలస కూలీగా పనిచేస్తూ ఇంటిని పోషించే వ్యక్తి చనిపోవడంతో కుటుంబ కష్టాలు మరింత పెరిగాయి. దీంతో స్పందించిన యువతరం సేవాసమితి సభ్యులు సోమవారం మృతుని స్వగ్రామమైన కూర్మనాథపురం వెళ్లి ఆయన భార్య ప్రేమకుమారికి రూ. 15వేలు అందించారు. కార్యక్రమంలో సమితి అధ్యకులు చింత మురళి, గొరకల సునీల్, అన్నెపు లక్ష్మణరావు, బత్తిని విఘ్నేష్, బత్తిని లక్ష్మణరావు, అర్జీ తులసీరావు, పుచ్చ వెంకటేష్, రమేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సాగుహక్కు పత్రాలు అందించాలి

మెళియాపుట్టి: మండలంలోని కౌలు రైతులను గుర్తించి పంట సాగు హక్కు పత్రాలను అందజేయాలని తహశీల్దార్ జానకమ్మ, మండల ఎఒ దానకర్ణుడు సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో, విఎఎలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ యజమానులు కౌలు రైతులకు పంట సాగుహక్కు పత్రాలు జారీ చేయడానికి తషమ కరించాలన్నారు. పంటసాగు హక్కుపత్రం తీసుకున్న కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు అన్నాజీరావు, హిమగిరి, సూర్య, శరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి చర్యలు

పొందూరు: ఎంతోకాలంగా గోతులు పడి రాకపోకలకు వీలులేకుండా అధ్వానంగా మారిన మార్కెట్ రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బి అధికారులు సోమవారం కొలతలను చేపట్టారు. మార్కెట్‌కు వెళ్లే రోడ్డులో గోతులు పడడంతో వర్షపునీరు నిలిచిపోతుంది. దీనివల్ల నిత్యం వాహనదారులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి శ్రీరంగనాయకులు తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన వెంటనే అత్యవసర నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.

తామాడలో అన్నదానం

లావేరు: మండలంలోని తామాడలో నవదుర్గ పీఠం వద్ద వారాహి అమ్మవారి నవరాత్రులు పూర్తికావడంతో సోమవారం దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. రౌతుపేట, రాయనింగారిపేట, పాతరౌతుపేట, లక్ష్మీపురం గ్రామాలకు చెందిన యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.